# ఆత్మీయత

-ఎమ్. లలితా సత్యమణి

"శ్రీవిద్య ఈ ఉత్తరం మీకిమ్మన్నారండీ!" అంటూ మాధవ ఉత్తరాన్ని తీసుకువచ్చి లీలకిచ్చాడు.


"మా విద్య నీకు ఎక్కడ కనిపించిందయ్యా! అది ఉత్తరం ఇవ్వటమేమిటీ?" తెల్లబోతూ అడిగింది లీల.

"నేను విజయవాడ నుంచి వస్తూంటే, తను విజయవాడ వెళ్ళే రైల్లో ఎక్కుతోందండీ! నన్నుచూసి, ఈ ఉత్తరం మీకిమ్మన్నది?" అంటూ మరోమాటకి ఎదురు చూడకుండా తన ఇంటివైపుగా వెళ్ళిపోయాడు మాదవ.

లీలకి కాళ్ళూచేతులూ వణికిపోతున్నాయి.

"విద్య ఎక్కడికి వెళ్ళినట్లు? చెప్పాచెయ్యకుండా వెళ్ళేంతధైర్యం ఎట్లా వచ్చింది? అయ్యో ఏం చెయ్యాలిప్పుడు?"

గుండె గుబగుబ లాడుతుంటే, ప్రక్కనే సోఫాలో కూలబడింది లీల.



"ఎవరు లీలా వచ్చింది?" లోపల పేపరు చదువుతోన్న జయరావు అడిగాడు.

ఆ మాటతో లీలలో చలనం వచ్చినట్లయింది. "ఏమండీ!" అంటూ ఒక్క ఉదుటునలేచి వెళ్ళి అతని చేతిలో ఉత్తరం పెట్టింది.

జయరావు ఉత్తరం చదివి, "ఇదేమిటే, ఇదిట్టా చేసిందీ!" అన్నాడు తల్లపట్టుకుని.

"ఏమిటి లీలవదినా? మీ విద్య ఎక్కడికి వెళ్ళిందిటా? మీకు చెప్పలేదా? ఏదో ఉత్తరం ఇచ్చిందంటాడేమిటి మాధవుడు!" అప్పుడే ప్రక్కింటి సావిత్రమ్మ చెవినపడనే పడింది లీల, మాధవుల సంభాషణ.

"అ, ఏం లేదండీ! మా పెద్దమ్మాయికి, గ్యాస్‌స్టౌవ్ అంటుకుని, చెయ్యి కాలిందిట. ఆ సంగతి ఫోన్‌లో మా అల్లుడు చెప్పేసరికి, మా విద్య వెంటనే హైదరాబాద్ ఆఫీస్‌నించి అటే వెళ్ళింది. ఆ సంగతి మాకు ఉత్తరం వ్రాసి, మాధవ చేత పంపించింది. ఆ సంగతి విన గానే మా ఆవిడకి బి.పి. పెరిగి, మాట్లాడలేకుండా ఉంది. అంతే అంతకంటే కంగారుపడవలసిందేం లేదు." అంటూ జయరావు సావిత్రమ్మకి సర్ది చెప్పాడు.

"పిల్లకి చెయ్యి కాలిందంటే, దడగా ఉండదుటండీ అన్నయ్యగారు? అయినా, విద్యకి ఎంతతోస్తే, అంతే, కాస్త ఇంటికివచ్చి, సంగతి సందర్భమూ చెప్పివెళితే, ఎంత బాగుండేది?" అంది సావిత్రమ్మ.

"ఏం చేస్తామండీ! ఈ కాలం పిల్లల తీరే అంత. మొన్న మీ కిరణ్ ఏం చేశాడు చెప్పండి? స్నేహితుడి పెళ్ళి అని ఆఫీస్ నించటే, హైదరాబాద్ వెళ్ళిపోతే, పాపం మీ రెంత కంగారు పడ్డారు. ఇప్పుడు మావంతు వచ్చింది." అనే సరికి, పాపం సావిత్రమ్మకి పచ్చివెలక్కాయ గొంతుకి అడ్డుపడ్డట్లయింది.

"పొయ్యి మీద పాలు పెట్టి వచ్చాను. వదినగార్ని పడుకోమని చెప్పండి. పనేమన్నా ఉంటే, నేను కాసేపుండి, వచ్చి చేసిపెడతాను." అంటూ హడావిడిగా, లోపలికి వెళ్ళి పోయింది సావిత్రమ్మ.

జయరావు వెంటనే తలుపు గడియవేసి, లీల దగ్గరకి వచ్చాడు.

"ఏమండీ నిజం చెప్పండి? విద్య ఎందుకు వెళ్ళింది? పెద్దదాని చెయ్యకాలటం అదీపోయినవారం సంగతి?" అంటూ కళ్ళ నీళ్ళతో అడుగుతోన్న భార్యని చూసి, "ఏం భయంలేదు లీలా! సావిత్రమ్మకి, పోయిన వారం పెద్ద మ్మాయి చెయ్యికాలిన సంగతి తెలీదుగా అందుకే అదిప్పుడు చెప్పాను! విద్య ఉత్తరం చదువుతాను విను"

"ప్రియమైన అమ్మా నాన్నలకి,

మీకు చెప్పకుండా నేనీ సాహసం చేస్తున్నానంటే, దానిక్కారణం మీరేను. ఆ సంగతి మీకూ తెలుసు. నేను మీకు ఆలస్యంగా పుట్టడం అన్నది నా చేతులలో లేని సంగతి.

మీకు కాస్త వయసు మళ్ళిన తరువాత పుట్టానన్న కారణంతో నన్ను అందరూ చాలా గారాబంగా చూశారు. అది నాకు ఎంతో ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ పెంచింది.

ఎందుకంటే, నాకు బుద్ధి తెలిసేసరికే అన్నయ్యలిద్దరూ అమెరికా వెళ్ళి పోయారు.

అక్కయ్య పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళింది. ఇంట్లో చిన్నదాన్నవటం చేత బామ్మా, తాతయ్యా, మీరిద్దరూ నన్ను నెత్తిన పెట్టుకున్నారు.

తాతయ్య అందర్నీ కాదని, నన్ను తీసుకువెళ్ళి ఇంగ్లీష్ కాన్వెంట్ స్కూల్లో చేర్పించారు.

నేను చెప్పే ఇంగ్లీష్ పద్యాలువిని ఎంతో సంబర పడేవాడు. మా తల్లి కలెక్టరవ్వాలనేవాడు. నిజంగా తాతయ్య బ్రతికుంటే, నేను కలెక్టరయ్యేదాన్నే. అయినా తాతయ్య వేసిన ఈ పునాది, అదే కలెక్టరవ్వాలన్నది నా ధ్యేయం అయింది.

దానికి తగ్గట్టుగానే, బ్యాంక్‌కి వెళ్లటం, బజారు పనులు, వగైరాలన్నీ నేనే చెయ్యాల్సి వచ్చేది. నడిచి వెళ్ళి వచ్చేసరికి కాళ్ళునొప్పులు అని గోలచేశానని, తాతయ్య పోయే ముందు నాకు సైకిల్ కొని, తనే నాకు దగ్గరుండి తొక్కటం, ట్రాఫిక్ రూల్సూ, అన్నీ నేర్పించాడు.

అదిచూసి బామ్మ "అది ఆడపిల్లండీ! దానికి మగ రాయుడిలాగా అన్ని పనులు నేర్పిస్తున్నారేంటి? 15, 16 ఏళ్ళకల్లా పెళ్ళిచేసి అత్తారింటికి పంపాలని నేనూ వాళ్ళమ్మా అనుకుంటూంటే, మీరేమిటి? సైకిల్ తొక్కటం నేర్పు తున్నారు?" అని గొడవపెట్టేది. అప్పుడు తాతయ్య, "ఆడపిల్లలకి కూడా ఈ రోజుల్లో అన్ని పనులు వచ్చి ఉండాలే! మీ రోజుల్లోలాగా ఆడది వంట ఇంటికే పరిమితం కాదు. సైకిలే కాదు కారు ఉంటే డ్రైవింగ్‌కూడా నేర్పుతాను. బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగం చెయ్యాలి. ఆ తరువాతే పెళ్ళి. ఇప్పుడే ఏం తొందర దానికి!" అని తాతయ్య నన్ను సపోర్టు చేసేవాడు.

తాతయ్య నేను టెన్త్‌లోకి వచ్చేసరికే పోవటం నా దురదృష్టం. ఆ తరువాత ఏడాదికే బామ్మ కూడా పోయినా, అమ్మ మాత్రం నా పెళ్ళి ప్రయత్నాలు మానలేదు.

అయితే డిగ్రీ అయినా కాకుండా చేసుకునే వాడెవడూ రాకపోబట్టి నా పెళ్ళి కాలేదుకానీ, మీ ప్రయత్నలోపం మటుకు కాదు. ఇప్పుడిహ డిగ్రీపూర్తయింది. ఇంక మిమ్మల్ని ఆపేవాళ్ళు లేరు.

నేను ఎన్నివిధాల నచ్చచెప్పినా అమ్మ వినిపించు కోవటం లేదు. డిగ్రీకూడా పూర్తికాకుండానే, అమ్మా బామ్మా కలిసి, అక్కయ్యకి పెళ్ళి చేశారు. అది ఏం సుఖపడు తోంది?

అత్తవారింటిలో పెద్ద కోడలుగా, మరుదుల చదువు ఆడబిడ్డల పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ పుణ్యాలూ. అంటూ ఎప్పుడూ గొడ్డు చాకిరీ. ఆ బాధ్యతంతా పూర్తి అయ్యాక, దాని పిల్లలు పెద్ద వాళ్ళయ్యేసరికి, దాని ఆరోగ్యం పాడయి పోయింది. ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉంది. స్వంత ఇల్లు లేకపోవటం వల్ల, వచ్చే ఆదాయంలో సగంపైన అద్దెకి పోతోందని, గొర్రెకు ఎప్పుడూ బెత్తెడే తోక అన్నట్లుగా ఉంటుందే జీవితం అనీ, అక్కయ్య బాధపడింది.

ఇవన్నీచూస్తూ కూడా, నన్ను నోరు మూసుకుని పెళ్ళిచేసుకోమంటే, నావల్లకాదు. అట్లాగని పెళ్ళిమీద నాకేమీ విరక్తిలేదు. జీవితంలో తోడు అవసరం. అయితే అది మరీ ఇరవై ఏళ్ళకే కాదు. కాస్త నా కాలిమీద నేను నిలబడాలి. ఇవన్నీ అమ్మకి ఎంతగా చెప్పినా అర్థం చేసుకోదు. అందుకే ఈ ఉత్తరం.

భయపడకండి. నేను ఎక్కడికీ వెళ్ళటం లేదు. హైదరాబాద్ దగ్గర చిన్న పల్లెటూరులో కాన్వెంట్‌లో టీచర్‌గా సెలక్టయ్యాను. వాళ్ళే హాస్టల్ వసతి ఏర్పాటు చేశాం

# పాపం సైఫ్



మరో హీరోని అంతతొందరగా పొగిడే అలవాటులేని వాడిగా పాపులరైన హీరో సైఫ్ అలీఖాన్. అయితే ఈ మధ్య ఓరోజు ఏ మూడ్‌లో ఉన్నాడో ఏమో తనకి ఎదురుపడిన బాబీ దేవల్‌ని (ధర్మేంద్ర రెండో కొడుకు) చూసి 'అరే! చాలా బావున్నావ్ ఈరోజు' అని పొగిడాట్ట. బాబీ - సైఫ్‌ని మించినవాడు. ఆ మాటకి పెద్దగా ఉబ్బిపోకుండా - 'అవును, నాకా సంగతి తెలుసు' అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాట్ట. పాపం సైఫ్ పరిస్థితి చెప్పనలవి కాదు, అటూ ఇటూ చూసి తనూ అక్కణ్ణుంచి జారుకున్నాట్ట.

-మౌర్య.

రెండేళ్ళు. కాంట్రాక్టు మీద వెళ్తున్నాను. మీకు చెపితే, నన్ను వెళ్ళనివ్వరనే, చెప్పకుండా వెళ్ళటం! అడ్రసిస్తున్నాను. ఉత్తరం వ్రాయండి!

అమ్మా! బెంగపడకు. నాకేమీ భయంలేదు.

నీ

శ్రీ విద్య.

"ఎంతధైర్యం చేసింది విద్య?

నిజమే ముందుగా చెప్తే వెళ్ళనిచ్చేదాన్ని కాదు.

నాబాధ దానికేం తెల్సు? కూచుంటే లేవలేను. కూర నట్టి దింపలేను. అన్నట్లుంది నా పని. పోనీ, నా తర్వాత దీని భారం వహించిపెళ్ళి చేస్తారనుకోటానికి లేకుండా, ఉన్న కొడుకు లిద్దరూ దూరంగా ఉన్నారు. నాలుగేళ్ళకోసారి వచ్చి మొహం చూపించి పోతున్నారే తప్ప, మంచేమిటీ, చెడేమిటీ? అన్న వివరాలు వాళ్ళేంకనుక్కోవటం లేదు.

అయ్యో నాన్న రిటైరయ్యారు. పెళ్ళికి చెల్లెలుంది. డబ్బు, దస్కం సంగతి అడుగుదామన్న ధ్యాసే లేద వాళ్ళకి.

అలాంటప్పుడు విద్యకి పెళ్ళిచేసి నా బాధ్యత తీర్చుకోవాలనుకోవటం తప్పండీ! మనిద్దరి తరువాత, దాని మొహం చూసే వాళ్ళెవరండీ? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేని చదువు ఎందుకూ? ఎంతసేపు పెళ్ళి, పెళ్ళి అంటారు. అన్న బాధేతప్ప, అట్లా అంటానికిగల కారణాలు పరిస్థితులనూ, అస్సలు అర్థం చేసుకోదే! ఎట్లా బ్రతుకుతుందిదీ?" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటున్న భార్యా భుజంతట్టి,

"బాధపడకు లీలా! మన భావాలు వేరు, ఈ కాలం పిల్లల భావాలు వేరు. తోడులేక పోయినా, బ్రతగ్గలమనే ధైర్యం ఉంది ఆడపిల్లకి.

పెళ్ళితో వచ్చే బాధలనూ, బాధ్యతలనూ తట్టుకోవాలంటే, ఆడవాళ్ళకి ఆర్థికంగా నిలబడే స్థితి ఉండాలి. విద్య అదే పట్టుదలతో ఉంది.

పోనీవే, కొన్నాళ్ళుదాని మాటనే మన్నిద్దాం. మనిద్దరం ఎందుకిక్కడ. పిల్ల ఉన్న చోటుకే వెళ్ళిపోదాం. విద్య పనిచేసే స్కూల్ ఫోన్, నెంబరిచ్చింది. రేపు వెళ్ళి ఫోన్ చేసి, ఇల్లు చూడమంటాను.

లే ధైర్యం తెచ్చుకో! చూడు బి.పి. పూర్తిగా తగ్గినట్లుంది. చెమటలు పోస్తున్నాయి నీకు. ఇట్లా పడుకో! పాలు తెస్తాను. తాగితే, కాస్త ఓపిక వస్తుంది.

పోనీ, సావిత్రమ్మ గారిని రమ్మని చెప్పనా! నీ దగ్గర కాసేపు కూర్చుంటుంది." అన్నాడు జయరావు. "వద్దు వద్దు. సావిత్ర మ్మగారొద్దు. పాలు త్రాగి, అట్లా రామాలయంకేసి వెడదాము పదండి! అక్కడ పురాణ ప్రవచనం ఉందిట. కాసేపు విని వద్దాం." అంది లీల.

ఇద్దరూ తలుపుకు తాళం పెట్టి, రామాలయం వేపు బయల్దేరారు.

"వదినగారూ! రామాలయంకేనా, నేను వస్తాపదండి! మా అన్నయ్యగారు మీరూ చక్కగా జంటగా వెడతారు. మా ఆయనా ఉన్నారెందుకు? ఎంతసేపూ సంపాదన తప్ప, ఓ అచ్చటాముచ్చటా లేదు కదా!" అంటూ వెంట వచ్చింది సావిత్రమ్మ.

"ఆయనంత తాపత్రయపడి సంపాదిస్తున్నారు గనుకే, మీరు వంటినిండా నగలతో ఖరీదైన చీరలు కడుతూ, మహాలక్ష్మిలా తిరుగుతున్నారు. మా ఆవిడకేం ఉందండి? 60 రూపాయల వాయిల్‌చీర, మెడలో పసుపుతాడు, చేతికి మట్టిగాజులు తప్ప." నవ్వుతూ అన్నాడు జయరావు.

"ఛ, ఊరుకోండి! నేనెప్పుడైనా, మీరు నాకు నగలూ చీరలూ కొనివ్వలేదని బాధపడ్డానా?" చిరుకోపంగా అంది లీల.

"ఇదిగో, ఈ అన్యోన్యతే నాకు లేనిది. మిమ్మల్ని చూస్తే నాకు నిజంగా సంతోషంగా ఉంటుంది. ఉన్న దానిలో కలోగంజో త్రాగుతూ, ఒక్కమాట మీదుంటారిద్దరూను.

మీ అబ్బాయిల సంగతేమోగానీ, మీ అమ్మాయి విద్య, బుద్ధిమంతురాలు. స్త్రీకి, మంచి సంతానం, అనుకూలుడైన భర్తకి మించిన, సంపదేముందండీ? మా ఆయన సంగతి తెలియందేముందీ?

పగలంతా బట్టలకొట్టుతో గడిచిపోతుంది. కొట్టు కట్టేసి, తాగి తందనాలాడుతూ, ఇంటికొచ్చి నానా రభస చేస్తాడు.


నాకీ నగలవల్ల, ధనంవల్లా వీసమెత్తయినా సుఖం లేదు సుమండీ! అందుకే వీలైనంతసేపూ లీల వదినగారి దగ్గర కూర్చుంటాను. మీ ఇంట్లో ఉన్నంత సేపూ నా మనస్సు కెంతో శాంతిగా ఉంటుంది." అంటూ కళ్ళు వత్తుకుంది సావిత్రమ్మ.

తమ కుటుంబం గురించి ఆవిడ మెచ్చుకుంటూంటే, విరక్తిగా నవ్వుకుంది లీల.

"పోనీలెండి వదినగారూ! బాధపడకండి! కాసేపు మన బాధలూ, భయాలూ అన్నీ మరిచిపోయి, పురాణ పురుషుల గురించి వింటే,మనస్సు కెంతో శాంతిగా ఉంటుంది. త్వరగా నడవండి. పురాణానికి టైమ్ అయింది." అంటూ సావిత్రమ్మని ఓదార్చి గబగబా నడవసాగింది లీల.

అంతలోనే ఎంతో ఆత్మీయులుగా మాట్లాడుకుంటూన్న ఆడవాళ్ళిద్దరినీ చూసి నవ్వుకుంటూ వారి వెంటే నడిచాడు జయరావు.


ఎమ్. లలితా సత్యమణి
W/o ఎమ్.ఎమ్. సుధాకరరావుగారు
నెం. 2, కొత్త ట్యాంక్ వీధి,
నుంగంబాకం
మద్రాస్ - 600 034.




"మా వాడికి నూటికి తొంభైలొచ్చినా మీ కాలేజీలో సీటులేదని పంపించారేమండీ?"

" తెలివిగల వాళ్ళందర్నీ చేర్చుకుంటే, తెలివి తక్కువవాళ్ళ బాధ్యత ఎవరు వహిస్తారండీ?"

-బి.సంజీవ్,
ఇ.నం.10-13,
నందిపేట.




బాలనుపాక బాలరాజు తండ్రి:వెంకటేశ్, గ్రా:గుండ్లెగూడెం, మం:ఆలేరు, జిల్లా:నల్గొండ-508001.